కూటమిపై రైతు కన్నెర్ర

అన్నదాతలకు అండగా జిల్లా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నిరసన ర్యాలీకి హిందూపురం, పెనుకొండ, మడకశిరకు చెందిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు భారీగా తరలివెళ్లారు. ముందుగా ఆయా మండల కేంద్రాల్లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వివిధ వాహనాల్లో నాయకులు, కార్యకర్తలు అనంతపురం తరలివెళ్లారు.

- రైతు పోరుబాటకు తరలిన నాయకులు
- అన్నదాతకు న్యాయం చేయాలని డిమాండ్


హిందూపురంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.ఎన్.దీపిక


మడకశిరలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు


మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో కలసి ర్యాలీలో పాల్గొన్న రొళ్ల నాయకులు

హిందూపురం: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'రైతు పోరుబాట' నిరసన కార్యక్రమానికి హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి టి.ఎన్.దీపిక ఆధ్వర్యంలో పెద్దఎత్తున రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద రైతులకు మద్దత్తుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ రైతులకు అండగా నిలవలేని ప్రభుత్వం ఉన్నా లేనట్లే అన్నారు. అధికారం చేపట్టి ఆరు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతులకు ఎలాంటి సాయం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందన్నారు. రైతులకు న్యాయం జరిగేంత వరకు అన్నదాత వెన్నంటే ఉండి పోరాడతామన్నారు.అనంతరం వైఎస్సార్‌సీపీ పార్టీ ఆఫీసు నుంచి బైపాస్‌రోడ్డు, మెయిన్‌రోడ్డు మీదుగా కొట్నూర్ రోడ్డు గుండా పుట్టపర్తికి భారీ వాహనాల్లో తరలివెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్వీ శివ, మున్సిపల్ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ చైర్మన్ జబీవుల్లా, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, వైస్ ఎంపీపీ అంజన్‌రెడ్డి, నిసార్, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, మండల కన్వీనర్, మన్సూర్‌ఖాన్, సీఎస్‌పీ నాగరాజు, రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి: పుట్టపర్తిలో తలపెట్టిన రైతు పోరుబాట కార్యక్రమంకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థ నాయకులు శుక్రవారం ఉదయం పుట్టపర్తికి బయలుదేరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నారాయణ స్వామి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సమస్యలపై పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యలయం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరనారాయణరెడ్డి, పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీ భర్త చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, రైతులు తరలివెళ్లారు. తొలుత గుమ్మయ్యగారిపల్లి సర్కిల్ వద్దకు చేరుకున్న పార్టీ శ్రీణులు.. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పుట్టపర్తికి తరలివెళ్లారు.

సోమందేపల్లి నుంచి..

సోమందేపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో జరిగిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి మండలం నుంచి భారీ ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్లారు. వైఎస్సార్ సర్కిల్‌లో నుంచి గోరంట్ల మీదుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌తో కలిసి భారీ కాన్వాయ్‌తో వెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు రమాకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: రైతన్నలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ చేపట్టిన 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' కార్యక్రమానికి శుక్రవారం మండలం నుంచి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పుట్టపర్తికి తరలివెళ్లారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు అభిమానులు వివిధ వాహనాల్లో ఉదయం పుటపర్తికి వెళ్లినట్లు మండల కన్వీనర్ బి.తిమ్మయ్య పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలి ఆధ్వర్యంలో తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాలు తెలిపారు.


రైతు పోరుబాట కార్యక్రమానికి తరలివెళ్తున్న హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు


లేపాక్షిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోరుబాటకు తరలిన మడకశిర నాయకులు

మడకశిర: పుట్టపర్తిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు పోరుబాట ర్యాలీకి మడకశిర నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను నిండా ముంచారని ఆరోపించారు. ఆరు నెలల కూటమి పాలనలో వారికి పైసా సాయం అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అన్నదాతలకు వ్యతిరేకంగా పాలన చేస్తోందని విమర్శించారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా రద్దు చేసిందన్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో బయలుదేరారు. మాజీ మంత్రి నర్సేగౌడ్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ వైఎస్సార్‌సీపీ విభాగం అధ్యక్షుడు రంగేగౌడ్, రాష్ట్ర కార్యదర్శులు రవిశేఖరరెడ్డి, వాగేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీలు నరసింహమూర్తి, పీఆర్ మూర్తి, ఎంపీపీలు రాధమ్మ, ఈరన్న, మండల కన్వీనర్లు రామిరెడ్డి, నరసింహారెడ్డి, త్రిలోక్‌నాథ్, యంజారేగౌడ్, నియోజకవర్గ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ కేటీ నాగేంద్ర, స్థానిక దళిత విభాగం నాయకుడు, న్యాయవాది అశ్వత్థనారాయణ, నాయకులు సత్యనారాయణయాదవ్, బాలకృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, తిమ్మప్ప, రంగనాథ్, నటరాజు, నారాయణ, మంజునాథ్, అశ్వత్థ్, పాండు, వైస్ ఎంపీపీ హేమంత్, జయకుమార్, ఈరన్న, తిమ్మరాయప్ప, శీనప్ప, హనుమంతరాయప్ప,శివ పాల్గొన్నారు.

రొళ్ల: పుట్టపర్తిలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన రైతు పోరుబాట కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ తాలూకా బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, మండల జేసీఎస్ కన్వీనర్ కేటీ నాగేంద్ర, ఎంపీటీసీ లింగరాజు, వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి, నాయకులు యర్రగుంటప్ప, మంజునాథ్, సురేష్, హనుమంతరాయప్పతో పాటు సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులతో కలిసి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

క్లుప్తంగా

నైతిక విలువలను పెంపొందించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు కల్పన

హిందూపురం టౌన్: విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలను పెంపొందించాలని ఉపాధ్యాయులకు స్పెల్ శిక్షణ రాష్ట్ర పరిశీలకురాలు కల్పన సూచించారు. మండలంలోని బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకటి, రెండు తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తెలుగు, ఇంగ్లిష్, గణితంపై 4వ స్పెల్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు, దేశ భక్తి, స్వాతంత్ర్య సమర యోధుల గురించి వివరించాలన్నారు. ఎంఈఓలు గంగప్ప, ఆంజనేయులు నాయక్, శేషాచలం, ఆర్పీలు రాజు, అశ్వతప్ప, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగు విస్తీర్ణం పెంచండి


మాట్లాడుతున్న ఏడీ సనావుల్లా

మడకశిరరూరల్: మండలంలో రాగి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకుడు సనావుల్లా ఆర్బీకే సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఆర్ అనంతపురంలో రైతులకు రాగి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో నీటి సౌకర్యం ఉన్న రైతులు రాగి పంటను సాగు చేసి ఆదాయం పొందాలన్నారు. పంట సాగు చేయి రైతులకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. వ్యవసాయంలో రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చున్నారు. కార్యక్రమంలో ఏడీ కృష్ణమీనన్, సర్పంచ్ అంజినమ్మ, ఏఈలు తిమ్మప్ప, వీరనరేష్, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్‌లో కెమిస్ట్రీ ల్యాబ్ ప్రారంభం


ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న మస్తానయ్య

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను శుక్రవారం ఏపీ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి మస్తానయ్య, ఎంఈఓలు లక్ష్మీదేవి, శేషాచలం ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తానయ్య మాట్లాడుతూ.. ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లిలో చదివిన వందలాది మంది నేడు దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. ఆర్మీ విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్ బాబు, సమగ్ర శిక్ష డీఈఈ చిదంబరం ఆర్మీ విభాగపు అధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల సీజ్

గుడిబండ: కొంకల్లు గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న నాగభూషణం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప శుక్రవారం సాయంత్రం తెలిపారు. అతని వద్ద ఉన్న 30 మద్యం (90ఎంఎల్) ఒరిజినల్ చాయ్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు

మడకశిరరూరల్: భక్తరపల్లిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, కార్యదర్శి అశ్వత్థ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

చిలమత్తూరు: పొగాకు ఉత్పత్తులు, పాన్ పరాగ్ వంటివి పాఠశాలల సమీపంలో విక్రయిస్తే చర్యలు తప్పవని వైద్యాధికారి డాక్టర్ రామకృష్ణ, ఎస్ఐ మునీర్ అహ్మద్ దుకాణాదారులను హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ప్రోగ్రామ్ అధికారి త్రిలోక్ నాథ్ ఆధ్వర్యంలో ఉదయం చిలమత్తూరులో పొగాకు ఉత్పత్తులు (బీడీ, సిగరెట్, హాన్స్, గుట్కా) ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు 300 అడుగుల దూరంలో విక్రయం, వినియోగించడంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పోలీసుశాఖ ద్వారా షాప్స్ యజమానులు నుండి చట్ట ప్రకారం జరిమానా విధించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా కార్యకర్తలు, సిబ్బందిని సమావేశపరిచి అవగాహన, శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ తేజస్విని, సైకాలజిస్ట్ రాణమ్మ, సీహెచ్‌ఓ జయచంద్ర కుమార్, పర్యవేక్షకులు గోవిందప్ప, ఆరోగ్య కార్యకర్త మంజుల, పీసీలు విజయ్ కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఉన్న దుకాణానికి జరిమానా విధిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో హెచ్‌ఎంకు తీవ్ర గాయాలు

రొళ్ల: హొట్టేబెట్ట వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో హెచ్ఎం వెంకటరామిరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలున.. హెచ్‌టీ హళ్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తున్న వెంకటరామిరెడ్డి సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై చెన్నేకొత్తపల్లిలోని ఇంటికి బయలుదేరారు. హొట్టేబెట్ట వద్ద కావేరి ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే 108 ద్వారా మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనాల మేరకు కుటుంబ సభ్యులు బెంగళూరు తరలించారు.


గాయపడిన హెచ్ఎం వెంకటరామిరెడ్డి


హిందూపురంలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తి పల్లకీ ఊరేగింపు దృశ్యం

ఘనంగా హనుమజ్జయంతి

సాక్షి నెట్‌వర్క్: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో శుక్రవారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులు, మహిళలు హాజరై మొక్కలు తీర్చుకున్నారు.భక్తులకు అన్నదానం చేపట్టారు.


పావగడ: అలంకరణలో కోటి ఆంజనేయస్వామి


కోడిపల్లిలో ఆంజనేయస్వామి


అమరాపురం: హాలుకూరులో ఆంజనేయస్వామికి హారతులను తీసుకెళ్తున్న భక్తులు

తల్లి ఆస్తిలో భాగమివ్వాలని మహిళ దీక్ష

హిందూపురం: తల్లి ఆస్తిలో మాకు భాగమివ్వాలంటూ మేనమామ ఇంటి ముందు వసంతలక్ష్మి, ఆమె సోదరులు కృష్ణప్రసాద్, ప్రకాష్‌బాబు కుటుంబసభ్యులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.వివరాలు హిందూపురంలోని ధన్ రోడ్డు వద్ద లక్ష్మిప్రసాద్ బంగారు నగల తయారీ చేస్తున్నాడు. ఆయన సోదరి నారాయణమ్మకు పుసుపుకుంకుమ కింద కొంత ఆస్తి ఇచ్చారు. 2006లో నారాయణమ్మ, ఆమె భర్త మరణించారు. అప్పటి నుంచి ఆస్తినంతా ఆయనే అనుభవిస్తున్నాడు. నారాయణమ్మ సంతానం ఆస్తి అడినపుడల్లా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నాడు. నిలదీస్తే ఎలాంటి ఆస్తి లేదని బుకాయిస్తున్నాడని, తనకు డబ్బు పలుకుబడి ఉందని రాజకీయ నాయకులు అండగా ఉన్నారని, పోలీసులు ఎవరూ ఏమీ చేయలేరని మేనమామ లక్ష్మిప్రసాద్ అంటున్నాడని వసంతలక్ష్మి వాపోతోంది. మా అవ్వ ఆస్తిలో మా అమ్మకు వాటా వచ్చింది. అమ్మ ఆస్తి మాకు రావాలి కాని మేనమామ ఇవ్వకుండా బుకాయించడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి ఆస్తి తగాదా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు చేరింది. పోలీసులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు.


మేనమామ ఇంటి ముందు కుటుంబసభ్యులతో నిరసన తెలుపుతున్న వసంతలక్ష్మి, సోదరుడు

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

హిందూపురం టౌన్: సాగునీటి సంఘాల ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎన్ఎస్ఎస్ యాక్ట్ అమలు ఉంటుందని, జనం గుమిగూడితే చట్టరీత్యా చర్యలు ఉంటాయని తహశీల్దార్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పెనుకొండ రూరల్: సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ ఆనంద్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఎన్నికలు నిర్వహించే గ్రామాల్లో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎలాంటి అవాంతరాలు చోటు చేసుకొకుండా ఎన్నికలు సజావుగా సాగేలా చుడాలన్నారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రాఘవన్, జనార్దన్, ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ, తదితరలు పాల్గొన్నారు.

గుడిబండ: మండలంలో శనివారం నిర్వహించనున్న తొమ్మిది సాగునీటి సంఘాల ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. తొమ్మిది సంఘాల్లో 1,880 మంది ఓటర్లు ఉన్నారని, ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ ఓటింగ్ ఉంటుందన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

రొళ్ల: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయం-1 ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని భూ సమస్యలు ఏమైన ఉంటే రైతులు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వివిధ సమస్యల పై రైతుల నుంచి 21 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ గిరియప్ప, వీఆర్వోలు వైకుంటప్ప, నరసింహమూర్తి, సర్వేయర్ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బాబురావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


రొళ్లలో అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి

హీరో వెంకటేష్ జన్మదిన వేడుకలు

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో శుక్రవారం సినీ నటుడు విక్టరీ వెంకటేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెంకటేష్ బర్త్ డేను పురస్కరించుకుని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలలో చదువుతున్న సుమారు 250 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్ అభిమాన సంఘం అధ్యక్షుడు గోపి, ఉపాధ్యక్షుడు అల్లీపీరా, మహేష్, నరేష్, హర్షవర్ధన్ రెడ్డి, కార్తీక్, హెచ్ఎంలు చాంద్‌బాషా, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంట గది నిర్మాణానికి చర్యలు

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట గది నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఎస్ఎల్‌పీ సంస్థ ఎండీ మిన్‌షియా కిమ్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలను కంపెనీ ప్రతినిధులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు తరగతి గదులను పరిశీలించారు. పాఠశాలకు షెడ్‌తో పాటు వంట గది లేదని విద్యాధికారులు సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో నిర్మాణం చేపడుతామని వారు హామీ ఇచ్చారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

హిందూపురం: విశాఖపట్నంలో టీడీపీ కార్పొరేటర్ గోవిందరెడ్డి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల మనోభావాలను ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల అధ్యక్షుడు అశ్వర్థ, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జయప్రసాద్ రెడ్డి విమర్శించారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ మున్సిపాలిటి వార్డు సచివాలయల వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, లలిత్ కుమార్, ముత్యాలమ్మ, లక్ష్మికళ, హేమావతి, రామునాయక్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

పెనుకొండ రూరల్: మండలంలోని రాంపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఇండేన్ గ్యాస్ సిబ్బంది గ్యాస్ వినియోగంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్యాస్ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు జరిగితే వెంటనే గ్యాస్ ఏజెన్సీకి సమాచారం ఇవ్వాలన్నారు.

17 నుంచి మొబైల్ ఆధార్ క్యాంపు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపును నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నరసింహమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, కొత్తగా ఆధార్ నమోదుకు అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల అపార్ ఎన్‌రోల్‌మెంట్ కోసం మొబైల్ ఆధార్ క్యాంపు ఉపయోగపడుతుందన్నారు.

15 నుంచి చౌడేశ్వరీ ఆలయంలో పూజలు

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం చౌడేశ్వరిదేవి ఆలయంలో కరణం రమామణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ కరణం రమానందన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు మెజిస్టిక్‌లో వెలసిన మహాసంస్థానం అణ్ణమ్మదేవితో పాటు చోళసముద్రంలో వెలిసిన చౌడేశ్వరీదేవి అమ్మవార్లను ఊరేగిస్తామన్నారు. కార్యక్రమం నాలుగు రోజులు పాటు జరుగుతుందని, భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.